# పోలింగ్ నిర్వహణకు సిద్ధం

- కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు
- పరిశీలించిన కలెక్టర్లు, ఎస్పీలు
- ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్



బోథ్‌లో పోలింగ్ కేంద్రానికి వచ్చిన సిబ్బంది



ఉట్నూర్‌లో ఈవీఎంలతో సిద్ధంగా ఉన్న సిబ్బంది



సిరికొండలో విధులకు హాజరవుతున్న పోలింగ్ సిబ్బంది

నిర్మల్ టౌన్, మే 12 : జిల్లాలో పార్లమెంటు ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమ వారం ఉద యం 7గంటల నుంచి సాయంత్ర 4గంటల వరకు పోలింగ్ నిర్వహించ నున్నారు. నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో లో 306, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 309, ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 311 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, జిల్లాలో మొత్తం 926 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 7,37,416 ఓటర్లు ఉన్నారని, నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,58,314 ఓటర్లకు గాను 1,21,991 పురుషులు, 1,36,304 మహిళలు, 19 మంది ఇతర ఓటర్లు, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,24,523 ఓటర్లకు గాను 1,09,685 పురుషులు, 1,14,825 మహిళలు, 13 మంది ఇతర ఓటర్లు, ఆలాగే ముథోల్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,54,579 ఓటర్లకు గాను 1,23,583 పురుషులు, 1,30,978 మహిళలు, 18 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వంద శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 149 సమస్యాత్మక, నక్సల్ ప్రభావిత, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. జిల్లాలో 97.81 శాతం ఓటరు గుర్తింపు స్లిప్పుల పంపిణీ పూర్తయిందని, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని వికలాంగులకు మొత్తం 636 మందికి హోం ఓటింగ్ సదు పాయాన్ని కల్పించగా 609 మంది ఓటర్లు హోం ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు పోలింగ్ జరుగ నుంది. ఇప్పటివరకు సి విజిల్ యాప్‌లో 14 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించారు.1950 టోల్ ఫ్రీ నెంబర్ కు వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించామని తెలిపారు. ఇప్పటివరకు ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 3 కోట్ల 81 లక్షల వరకు డబ్బు, మద్యం స్వాధీనం చేసుకున్నారు. పోలింగ్ కేంద్రంలో 5 సిబ్బందిని ఏర్పాటు చేశారు.

## తాంసిలో..

తాంసి, మే 12 : ఆదివారం పోలింగ్ సిబ్బంది నిర్దేశిత కేంద్రాలకు చేరుకుని పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. మండలంలో 60 మంది సిబ్బందితో మొత్తం 17 పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ లక్ష్మి తెలిపారు. సూపర్‌వైజర్లు మహేందర్, నరేష్ స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి దారవేణి రాఘవేంద్ర పోలింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## బైంసాలో..

బైంసా, మే, 12: ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి అన్నారు. మొత్తం 311 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఇందులో 21 సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,53,604 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,23,208, మహిళలు 1,30,378, ట్రాన్స్ జెండర్‌లు 18 మంది ఉన్నారు. మొత్తం 311 పోలింగ్ బూత్ లలో కుభీర్ మండలంలో 1 నుంచి 52 పోలింగ్ కేంద్రాలు, కుంటాల మండలంలో 53 నుంచి 76, నర్సాపూర్ లో 74 నుంచి 84, బైంసా పట్టణంతో పాటు మండలంలో 87 నుంచి 174, లోకేశ్వరంలో 175 నుంచి 212 , ముథోల్‌లో 213 నుంచి 247, బాసరలో 248 నుంచి 267, తానూర్‌లో 268 నుంచి 311 ల వరకు పోలింగ్ బూతులు ఉన్నాయని తెలిపారు.

## కుంటాలలో..

కుంటాల, మే, 12: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు, విద్యుత్ సౌకర్యం టాయిలెట్లు ర్యాంపు తదితర సౌకర్యాలను కల్పించినట్లు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఇన్‌చార్జి, ఎంపీడీవో ఎంఎ రహీం అన్నారు.

## భీంపూర్ మండలంలో..

తాంసి(భీంపూర్), మే 12 : మండలంలోని 26 గ్రామపంచాయతీలు, అనుబంధ గ్రామాలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కరంజి(టీ) అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిశితంగా తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి దేశీదారు, డబ్బులాంటివి రవాణా కాకుండా పరిశీలిస్తున్నారు. తహసీల్దార్ నారాయణ, డీటీ హరీష్, ఎస్సై ప్రదీప్‌కుమార్ ఇప్పటికే మండలంలో అన్ని గ్రామాల్లో ఏర్పాట్లపై సమీక్ష చేశారు.

## ఉట్నూర్‌లో..

ఉట్నూర్, మే12 : పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఖానాపూర్ నియోజకవర్గంలో నిర్వహించే ఏర్పాట్లను అధికారులు ఆదివారం పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాలకు తరలించే సామాగ్రిని పట్టణంలోని స్థానిక కొమరంభీం ప్రాంగణంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రాంగణంలో సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాలు ఉండగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి జీవాకర్‌రెడ్డి తెలిపారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓ, పోలింగ్ ఆఫీసర్, పోలింగేతర సిబ్బంది మొత్తం ఐదుగురు సిబ్బంది ఉంటారని, రూట్లలో ప్రత్యేకంగా సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. 03 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని పేర్కొన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కావాల్సిన భద్రతలు కల్పిస్తున్నామని అన్నారు. 309 రూట్ల ద్వారా అధికారులను పోలింగ్ కేంద్రాలను తరలించినట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

## ముథోల్ లో..

ముథోల్, మే. 12 : ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోమల్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో 311 ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. 377 పీవోలు, ఏపీవోలు పనిచేస్తున్నారని వెల్లడించారు. అలాగే 754 ఓపీవోలు సుమారు 4 వేల సిబ్బంది పనిచేస్తున్నట్లు తెలిపారు. ముథోల్‌లోని గురుకుల కళాశాలలో సిబ్బందికి ఈవీఎంలను పంపిణీ చేశారు. పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ పరిశీలించి పలు సూచనలు అందజేశారు.

## పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

బోథ్, మే 12 : బోథ్ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహిం చనున్న ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల విధుల కోసం నియమించిన సిబ్బంది ఆదివారం తరలివెళ్లారు. నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది మండలాల్లో 306 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని 35 రూట్లుగా విభజించారు. సుమారుగా 1620 మంది అధికారులను నియమించారు. మొత్తం 2,11,313 మంది ఓటర్లకు గాను పురుషులు 1,02,458, మహిళలు 1,08,852, ఇతరులు 3 ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

## సోన్‌లో..

సోన్, మే 12 : నిర్మల్, సోన్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం సిబ్బంది ఆయా గ్రామాలకు చేరుకున్నారు. సోన్ మండల కేంద్రం తో పాటు పాక్‌పట్ల, మాదాపూర్, న్యూవెల్మల్ బొప్పారం, సంగంపేట్, సాకెర, నిర్మల్ మండలం లోని వెంగ్వాపేట్, లంగ్డాపూర్, డ్యాంగాపూర్, అక్కాపూర్, నీలాయిపేట్, మేడిపెల్లి, తదితర గ్రామాలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.

## సిరికొండలో..

ఇచ్చోడ(సిరికొండ), మే 13 : మండలంలోని మొత్తం 50 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలంలోని ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలో 9, బోథ్ నియోజకవర్గం పరిధిలో 10 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీవో మేకల లక్ష్మి, ఏపీవో కంట రావ్, వోపీవోలు ఇందుర్ గంగన్న, నవీన్‌కుమార్, ఉన్నారు.

## ప్రత్యేక పోలీస్ బందోబస్తు

ఇంద్రవెల్లి, మే12 : మండలంలో ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన 42పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఎన్నికల పోలింగ్ అధికారులు ఈవీఎంలతో పోలీస్ బందోబస్తు మధ్య చేరుకున్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయతీ, కెస్లాపూర్ పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు చేరుకోవడంతో పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక బలగాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్లకు స్వాగతం

కుంటాల, మే, 12: పోలింగ్ శాతం పెంచాలన్న ఉద్దేశంతో నియోజకవర్గంలోని ఒక పోలింగ్ స్టేషన్‌ను వ్యవసాయ నేపథ్య పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. దీనిలో భాగంగా ముథోల్ నియోజకవర్గంలోని లింబా (కే)లో ఒక పోలింగ్ స్టేషన్‌ను ఎంపిక చేశామని, ప్రజలందరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పా ట్లు చేశామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, నోడల్ అధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎ అబ్దుల్ రహీం, ఏపీవో నవీన్, ఆర్ఐ అడెల్లు, పంచాయతీ కార్యదర్శి గంగాప్రసాద్, సిబ్బంది అశోక్ పాల్గొన్నారు.



లింబా (కే)లోని ఆదర్శ పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల నోడల్ అధికారి విజయలక్ష్మి



నిర్మల్ టౌన్ : ఎన్నికల సామాగ్రితో కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది




తాంసి: కప్పర్ల పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



బోథ్‌లో బస్సు ఎక్కుతున్న సిబ్బంది, పోలీసులు



నిర్మల్‌టౌన్ : గ్రామాలకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది



నిర్మల్ : లంగ్డాపూర్‌లో ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది

## అన్ని వసతులు కల్పించాం




బోథ్‌లో పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

### కలెక్టర్ రాజర్షిషా

బోథ్, మే 12 : ఆదివారం బోథ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎన్నికల విధుల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. బోథ్ ఆర్వో, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తొమ్మిది మండలాల పరిధిలోని గ్రామాల్లో 306పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని కేంద్రాలను జీపీఎస్‌తో అనుసంధానించామన్నారు. కేంద్రాల్లో తాగునీరు, ఇతర వసతులు కల్పించామన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6వరకు పోలింగ్ ఉంటుందన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్నవారు, యువకులు, వృద్ధులు, వికలాంగులు ప్రతి ఒక్కరూ వచ్చి తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. అనంతరం పోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. సూచనలు అందిం చారు.

## ఏర్పాట్లు పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, మే 12 : ఉమ్మడి ఆదిలాబాదు పార్లమెంట్ స్థానానికి సోమవారం జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 7,36,811 ఓటర్లు ఉండగా 924 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఎన్నికల సిబ్బందికి సూచనలు అందించి గ్రామాలకు పోలీసుల బందోబస్తు మధ్య పోలింగ్ సిబ్బందిని తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నీటి, విద్యుత్, నీడ సౌకర్యాలు కల్పించారు. అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి ఎన్నికల అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

## పటిష్ట బందోబస్తు నిర్వహిస్తాం



బోథ్‌లోని స్ట్రాంగ్ రూంను పరిశీలించి వస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం

బోథ్, మే 12 : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం గట్టిబందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం వెల్లడించారు. ఆదివారం బోథ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రీబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూంలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజకవ ర్గాలతో పాటు ఖానాపూర్, ఆసీఫాబాద్ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ విధుల కోసం అవసరైన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయించామన్నారు. ఎక్కడ కూడా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నా రు. ఆయన వెంట డీఎస్పీ సురెందర్‌రెడ్డి, బో థ్, ఇచ్చోడ సీఐలు రమేష్, భీమేష్, తదిత రులు ఉన్నారు.

## అమ్మగా..అండగా

### క్షతగాత్రునికి ఎస్పీ చేయూత

నిర్మల్ అర్బన్, మే 12 : పట్టణంలోని జయశంకర్ చౌరస్తాలో ప్రియదర్శినినగర్ కాలనీ – ప్రసూతి ఆసుపత్రి నుంచి ఆదివారం మోటార్ సైకిల్‌పై బార్య ఇద్దరు పిల్లలతో బైక్‌పై వస్తున్న నిర్మల్ పట్టణానికి చెందిన మనోహర్‌ను ట్రాలీ ఆటో బలంగా డీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి ఎగిరిపడ్డ మనోహర్ చేతుకు తీవ్రగాయాలై రక్తస్రావం అయింది. అదే సమయంలో ఎస్పీ క్యాంపు కార్యాలయానికి ఎస్పీ జానకి షర్మిల వెలుతుండగా రోడ్డు ప్రమాదం జరగడంతో అక్కడికి వెళ్లి తీవ్ర గాయాలైన మనోహర్‌ను తన సెక్యూరిటీ వాహనంలో భద్రతా సిబ్బందితో అతని కోరిక మేరకు ఆదిత్య ఆసుపత్రికి దగ్గరుండి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతని యోగక్షేమాలను ఎస్పీ అడిగి తెలుసుకుంది. మదర్స్ డే రోజున అమ్మగా అండగా నిలిచిన ఎస్పీ జానకి షర్మిలను పలువురు అభినందించారు.



క్షతగాత్రుడిని దవాఖానకు తరలిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

## అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు

బాసర, మే 12 : బాసర సరస్వతీ అమ్మవారిని ఆదివారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీ కే. లక్ష్మణ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదపండితులు శాలువతో సత్కరించి అమ్మవారి అశీస్సులను, తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్, ఈవో విజయరామరావు, సిబ్బంది ఉన్నారు.

## ఓటు వేయనున్న గొల్లగడ్ వాసులు

తాంసి(భీంపూర్), మే 12 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని సరిహద్దు పెన్‌గంగా ఒడ్డున ఉన్న గొల్లగడ్ పంచాయతీ వారు గత అసెంబ్లీ ఎన్నికల్లో వారి గ్రామ సమస్యల కారణంగా పోలింగ్‌లో పాల్గొనలేదు. అయితే ఈసారి సోమవారం ఎంపీ ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొనబోతున్నారు. 276 ఓట్లు ఉన్న ఈ గ్రామానికి గతంలో అధికారులు వచ్చి నచ్చచెప్పినా ఫలితం కనిపించలేదు. అయితే ఇటీవల ఈ గ్రామం సందర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైందని, వీరు వినియోగించుకోవాలని ఓటు మీ ఇష్టప్రకారం ఎవరికైనా వేయండి, కానీ ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ఫలితంగా వారంతా ఇప్పుడు ఓటింగ్‌కు సిద్ధంగా ఉన్నారు.

## వాహనాల తనిఖీ



బాదనకుర్తి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

ఖానాపూర్, మే 12: నేడు జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లా హద్దులోని బాధనకుర్తి చెక్‌పోస్టు వద్ద అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆదివారం జిల్లాలోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని రూ. 50 వేలకు పైగా నగదును తీసుకువెళ్లాడానికి సరైన పత్రాలు కలిగి ఉండాలని అధికారులు సూచించారు. ఈ తనిఖీల్లో పోలీసు, పలుశాఖల అధికారులు ఉన్నారు.

## కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కుంటాల, మే, 12 : నేడు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరిగే ప్రాంతంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై రజనీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ పోలింగ్ సిబ్బందికి, పోలీసులకు సహకరించాలని కోరారు. పోలింగ్ కేంద్రం వద్ద 100 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీ నాయకులు ఉండాలని, సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక భద్రతా దళాలు, నిఘా ఏర్పాట్లు చేయనైనదని పేర్కొన్నారు. కావున అందరూ సహకరించాలని కుంటాల ఎస్సై కోరారు.

## ఓటును సద్వినియోగం చేసుకోవాలి

పెంబి, మే 12: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంబి మండలంలో 23 పోలింగ్ భూత్‌లలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకూండా అన్ని ఎర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండలంలో వందశాతం పోలింగ్ నమోదు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలింగ్ సిబ్బది, పోలీసు సిబ్బమది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత

నార్నూర్, మే12 : ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత దొరుకుతుందని జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తిరుమల, తిరుపతి దేవస్థానం ప్రథమ వార్షికో త్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమి టీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, చౌహాన్ మహేందర్, ఆడే దత్త, గజానంద్, భక్తులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

బోథ్, మే 12 : మండలంలోని కన్గుట్టలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల ఉత్సవమూర్తుల విగ్రహాలకు కల్యాణం జరిపించారు. బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## వైద్య శిబిరం

బోథ్, మే 12 : బోథ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం పార్లమెంట్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో సొనాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సిబ్బందికి అవసరమైన మందులు అందజేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ కుంట నవీన్‌రెడ్డి, సూపర్ వైజర్ నర్సింహస్వామి, ఫార్మాసిస్టు మనోహర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆచూకీ తెలుపండి

కుంటాల, మే, 12: మండలంలోని కల్లూరు శివారులో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (50–55) లభ్యమైంది. కుంటాల ఎస్సై రజనీకాంత్ కథనం ప్రకారం కల్లూరు పొలిమేరలో కొందరు యువకులు క్రికెట్ ఆడుతుండగా బంతి పక్కనే ఉన్న పంటల వైపు వెళ్లగా అక్కడ ఒక మృతదేహాన్ని చూశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించి బైంసాలోని మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## వారసంత బంద్

బైంసా, మే, 12: పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున సోమవారం జరిగే వారసంత రద్దు చేయబడుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13వ తేది నాడు పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున 144 సెక్షన్ విధించడం వల్ల వారసంత బంద్ ఉంటుందని పట్టణంతో పాటు గ్రామీణ ప్రజలు గమనించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677